ఆబోతుల శ్రీనివాసరావు

# అడుగులో అడుగు




**ఆ అమ్మాయి నచ్చింది నాకు. కవులు, రచయితలు వర్ణించినట్లు కుందనపు బొమ్మలా, బాపూ చిత్రాలలోని ఒకో విశిష్ట లక్షణం ఆమెకున్నాయ్!**

మేమీ కొత్త ఇంటికి వచ్చిన మొదటిరోజు సాయంత్రం మా ఇంటి ఎదురు డాబామీద కాఫీ తాగుతూ దర్శనమిచ్చిందామె. ఏడు చదువుతున్న నాలుగో చెల్లెలు వ్రమీ ఇవ్వట్నించి నన్ను గమనిస్తోందో కానీ, తట్టి, కుదిపినంతవరకు ఆమె లోకంలోనే ఉన్నాను.

నాన్న పోయిన దగ్గర్నుంచీ బండెడు బరువు బాధ్యతలన్నీ నామీదే పడ్డాయి. నాన్న చేస్తూ పోయిన ఉద్యోగం, డబ్బు (పి.ఎఫ్. వగైరాలు)తోపాటు అప్పులు కూడా దండిగానే సంప్రాప్తించాయి. నాన్నగారి హయాంలో ఆర్భాటంగానే జరిగింది అక్క పెళ్లి. కానీ, ఆ తర్వాత వరసగా ఈడొచ్చీ రాబోతున్న నలుగురు ఆడపిల్లలున్నారు. ఆ నలుగురు ఆడపిల్లలకీ ఒకే ఒక మగదిక్కైన అన్నయ్యని నేను.

ఆ అమ్మాయి ఏదో కాన్వెంటులో టీచర్‌గా పనిచేస్తోందని విన్నాను. నేను ఆఫీసుకు బయల్దేరే టైమూ, ఆమె కాన్వెంటుకు వెళ్లే టైమూ ఒక్కటే కావడం వల్ల రోజూ ఒకరికొకరం ఎదురుపడే వాళ్లం. ఒకరి వెనక ఒకరం నడిచేవాళ్లం.

ఆ అమ్మాయి కళ్లూ, నా కళ్లూ కలిసే ప్రతిసారీ ... నా కళ్లు మెరుస్తున్నట్టనిపించేవి. తను నన్ను చూసి సొట్టపడే బుగ్గలతో నవ్వే ప్రతిసారీ నా గుండెలో మంచుదిమ్మో, మరేదో దించుతున్నట్టనిపించేది.

రోజులు గడుస్తున్నాయి.

'ఇలా ఎన్నాళ్లు? ఈ రోజు ఎలాగైనా అడిగేయాలి' ... ఇలా ఎన్నోసారి అనుకున్నానో తెలీదు కానీ, గట్టిగానే నిశ్చయించుకున్నాను.

ఎప్పటిలాగే తను కాన్వెంట్‌కీ, నేను ఆఫీసుకీ వెళ్తున్నాం. ఆమె వెనక పదిఅడుగుల దూరంలో నేను నడుస్తున్నాను. నా చేతిలో 'ఈ రోజు సాయంత్రం ఐదింటికి పార్క్‌కి రండి. మీతో మాట్లాడాలి!" అని రాసి ఉన్న నాలుగు మడతల

నేను నడక వేగం పెంచాను. మా మధ్య దూరం క్రమేపీ తగ్గసాగింది. ఐదు క్షణాల్లో ఆమె పక్కనున్నాను. 'ఏమిటి?' అన్నట్టు వింతగా చూసింది తల తిప్పి.

"ప్లీజ్, ఇది తీసుకు చదవండి. మీకు నచ్చితే రండి! ఒక్క ఐదు నిముషాలే మాట్లాడాలి .... తప్పయితే క్షమించండి!" నోటికి వచ్చిన మాటలు తప్పో, ఒప్పో మాట్లాడి, నా చేతిలో చీటీ ఆమె చేతిలో పెట్టి అక్కణ్నుంచి మాయమయ్యాను.

* * *

ఆ అమ్మాయిని ఐదుకి రమ్మని, నేను మూడు నుంచే ఎదురుచూడడం ... నాకే నవ్వొచ్చింది. ఆ అమ్మాయిని రమ్మన్న టైమ్ అయ్యేంతవరకూ 'ఆ అమ్మాయి పార్కు గేటు తోసుకుంటూ ఎలా వస్తుంది? నేను ఎలా రిసీవ్ చేసుకుని ఎలా మాట్లాడాలి? అసలు నేను ఆమె పట్ల సరిగానే ప్రవర్తిస్తున్నానా?'లాంటి ఊహలతో, ప్రశ్నలతో ఇంకా - ఆమె తనకి గ్రీన్ సిగ్నల్ ఇస్తే పెళ్లి ఎలా (ఎంత గ్రాండ్‌గా) చేసుకోవాలీ, హనీమూన్ ఎక్కడ, ఎలా గడపాలీ ... ఒకవేళ ఆమె తన

ప్రేమని తిరస్కరిస్తే ఎలాంటి అఘాయిత్యం తల పెట్టి ఆమె ప్రేమ పొందాలి ... లాంటి ఆలోచనలతో గడిపేశాను.

ఈలోగా ...

ఎవరో ఐదేళ్ల బాబు తన తాతగారి చేతి చిటికెన వేలు పట్టుకు నడుస్తూ "టైమెంతయింది, తాతా?" అడిగాడు.

"ఐదయిందిరా!" ఆయన జవాబు.

దాంతోపాటు గేటు తోసుకుంటూ పార్కులోకి వస్తున్న 'ఆమె' కనిపించింది.

"హలో!" పలకరించి, దగ్గర్లో సిమెంట్‌బెంచ్ వైపు కదుల్తూ, "ఇట్రండి ..." ఆహ్వానించాను.

తను బెంచ్‌పై కూర్చుని, "చెప్పండి?" అంది.

మళ్లీ గుండెల్లో ఏదో గుబులు రెట్టింపైంది. ఇంకాస్త ధైర్యం చేసి, "నేను ... నేను ఓ ముఖ్యమైన విషయం మీకు చెప్పాలని ... నిర్భయంగా చెప్తున్నానండీ ... నాది పవిత్రప్రేమ! కల్తీ లేని పాల లాంటిది. నేనింతవరకూ ఏ అమ్మాయినీ కన్నెత్తి చూళ్లేదు. నా హృదయాన్ని దోచిన ఒకే ఒక అమ్మాయి మీరు!"

నోటికొచ్చిన మాటలు చెప్తున్న నాకు - 'రేయ్! నువ్వు ఒకోసారి అర్థం పర్థం లేని మాటలు చాలా సమర్థవంతంగా మాట్లాడగలవురా!' అన్న ఆత్మగాడి మాటలకు నొచ్చుకుని, అంతలోనే తమాయించుకుని, "ఇంతకీ విషయం ఏమిటంటేనండీ ... నేను ... నేను ... మిమ్మల్ని ..."

"ప్రేమిస్తున్నారు. అంతేనా!" కళ్లల్లోకి చూస్తూ అడిగింది.

తలొంచుకుని తల ఊపాను.

"దీనికి ఇంత టెన్షన్ ఫీలవుతారేంటండీ?"

ఆమె మాటలకి ఆశ్చర్యపోవడం నావంతైంది.

"అలా అని ప్రేమలో నేనేదో ఎక్స్‌పర్ట్‌నని అపార్థం చేసుకోకండి. నేను కూడా జీవిత భాగస్వామికోసం ఎదురు చూస్తున్నాను."

నా మొహంలో ఆనందంపు స్పందన.

మళ్లీ ఆమే - "ఎందుకంటే, నా తర్వాత పెళ్లీడొచ్చిన ముగ్గురు చెల్లెళ్లున్నారు. నా పెళ్లయితే కానీ వాళ్ల పెళ్లి అయ్యే అవకాశం లేదు. అందుచేత మీరు నిజంగా నన్ను ప్రేమిస్తున్నట్టయితే నన్ను వెంటనే పెళ్లి చేసుకుని, నా తల్లి దండ్రులకి నా భారం తీర్చి, నా చెల్లెళ్ల పెళ్లిళ్లకి దారి ఇవ్వండి!"

ఆమె చెప్పుకుపోతోంది. నేను కూర్చున్న బెంచ్‌తో సహా భూమి గిర్రున తిరుగుతున్నట్టనిపిస్తోంది.

తమ చెల్లెళ్ల పెళ్లికి రూట్‌క్లియర్ చేయడం కోసం 'ప్రేమించబడడం గొప్పదే!' అన్న సాకుతో సరిపెట్టుకుని, నాతో పెళ్లికి సిద్ధపడుతునప్ప ఆమె ముందు - నాకూ పెళ్లికెదిగిన నలుగురు చెల్లెళ్లుండగా నా పెళ్లికోసం ఆలోచించిన నేను పెద్ద ... ఫూల్‌ననిపించింది.

ఇంట్లో పెద్దకూతురు పెళ్లి కాకుండా మిగతా వారి పెళ్లిళ్లు అవ్వవు. అలాగే పెళ్లీడొచ్చిన చెల్లెళ్ల పెళ్లి కానిదే ఏ అన్నా తన పెళ్లికి తలపడడు. ఇది మన సంప్రదాయం.

నేను తప్ప ... మరే దిక్కూలేని నా వాళ్లు దీనంగా ఒకరి తర్వాత ఒకరు కనబడ్డారు. ఎందుకో ఆ క్షణంలో నా మీద నాకే అసహ్యం వేసింది.

ఈలోగా ఎప్పుడే లేచిందో, ఆమె నించుని - " ఏ విషయమూ వీలైనంత త్వరగా చెప్తే నాకూ, మా వాళ్లకీ సాయం చేసినవారవుతారు. వచ్చేవారం నన్ను చూడ్డానికి పెళ్లివారొస్తారట! ఈలోగా మీరు కోరుకుంటే నేను మీదాన్నవుతాను!" చెప్పి అక్కణ్నుంచి కదిలింది.

ఆహా ... ఎంత విచిత్రం! ఓ పావుగంట క్రితం నేను కోరుకున్నట్టే ఆమె నా ప్రేమకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా, నేనిప్పుడు ఏదో తెలియని నిరాశకూ, అసంతృప్తికీ లోనయ్యాను.

ఎందుకు? ఎందుకు?! ఎందుకు?!!

ఎందుకంటే నా కోరికలో బలహీనతుంది. నా ఆలోచనల్లో బాధ్యతని మరిచి స్వైరవిహారం చేస్తున్న అవకాశవాదం, స్వార్థం నిండిఉన్నాయి.

కళ్లు మూసుకుని బెంచ్ వెనిక్కి జారబడ్డాను. ఒకవేళ ఈమెని పెళ్లిచేసుకుని నా దారి నేను చూసుకుంటే నా తల్లీ, నా తర్వాత వారి గతీ ఏం కావాలి?

ఏవుందీ ... అమ్మ పాచిపనిలో చేరుతుంది. పెద్దచెల్లెలు చదువుతున్న డిగ్రీ ఆపి, కుట్టు మిషనో, మరేదో ఆశ్రయిస్తుంది. మిగతా చెల్లెళ్లు ... బట్టలషాపుల్లో సేల్స్‌గర్ల్స్‌గానో, ఇంటింటికీ సైకిల్‌పై వెళ్తూ ఇచ్చే పేపర్, పాలు, పచ్చళ్లులాంటివి అమ్మేవారుగానో స్థిరపడతారు.

ఈలోగా మగ దిక్కులేని నిస్సహాయతని ఆసరాగా తీసుకుని పురుషపుంగవుల నుంచి కామెంట్లూ, స్వార్థపు సానుభూతులు, వంకర నవ్వులులాంటివి షరా మామూలే!

ఓవేళ పై విధంగా కుదరకపోతే, ముష్టివాళ్లై పట్టెడు మెతుకులు కోసం హోటళ్లముందు చెత్త కుప్పల వద్ద కుక్కలతో బతుకు పోరాటం చేస్తూ, క్షుద్బాధ తట్టుకోలేక ఒళ్లు అమ్ముకోవడానికో, అంతకీ కాకపోతే కట్ట కట్టుకుని ఏ అఘాయిత్యానికో తలపడతారు!

???

ఆలోచిస్తున్న నా మెదడు నుంచి 'నో! అలా జరగడానికి వీల్లేదు! అలా జరగదు ... అలా జరగదు ...!" అనే ఆదేశపు సందేశం నోటిగుండా తీవ్రస్థాయిలో బయటకు వచ్చింది.

అక్కడున్నవాళ్లు, వచ్చి వెళ్తున్నవాళ్లూ నన్ను వింతగా చూస్తున్నారు. అవేవీ పట్టించుకోకుండా స్థిరమైన నిశ్చయంతో దిగ్గున లేచాను. ఇప్పుడు నా బుర్ర పెళ్లి ఎలా జరుపుకోవాలీ, హనీమూన్ ఎక్కడ జరుపుకోవాలని ఆలోచించట్లేదు.

కోరికలు కాల్చుకుని తనవారికోసం కరిగిపోవడానికి సిద్ధపడ్డ 'ఆమె' ఆదర్శపు వెలుగులో అన్నగా నా బాధ్యత తెలుసుకున్న నేను అక్కణ్నుంచీ కదిలి, నా అభిప్రాయాన్ని, ఇప్పట్లో ఆమెని చేసుకోలేని నా అసహాయతను, నిజాయితీగా ఆమెకి చెప్పుకుని ఒప్పుకోవడానికి ఆమె వెళ్లే దారిలోనే బయల్దేరాను.

ఇప్పుడు మా మధ్య దూరం ... దూరంగానే ఉంది.

P

